క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


రత్నప్రియదర్శిని

అనిగండ్లపాడు(పెనుగంచి ప్రోలు): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ వై.రత్నప్రియదర్శిని బుధవారం సూచించారు. ప్రస్తుతం ప్రజలకు ఆయుర్వేద వైద్యంపై మరింత అవగాహన పెరిగిందన్నారు. తమ వైద్యశాలకు రోజూ 30 నుంచి 40 మంది వైద్య సేవల కోసం వస్తున్నారన్నారు. ఒక్కో రోజు ఓపీ సంఖ్య 50 కూడా దాటుతుందన్నారు. ప్రస్తుతం జలుబు, దగ్గుతో బాధపడుతూ రోగులు వస్తున్నారని, వారికి అవసరమైన మందులు అంటుబాటులో ఉన్నాయన్నారు. ముఖ్యంగా మోకాలు, నడుం నొప్పుల కోసం చుట్టు పక్కల వారే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని దూర ప్రాంతాల నుంచి కూడా రోగులు అనిగండ్లపాడు ఆయుర్వేద వైద్యశాలకు వస్తున్నారన్నారు. ప్రజలకు పంచకర్మ సేవలు కూడా అందిస్తున్నట్లు వివరించారు.

నరసింహునికి ప్రత్యేక పూజలు



వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసి యున్న యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి పవిత్రోత్సవాలలో భాగంగా బుధవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వేదాంతం శ్రీధరాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి పుణ్యాహవచనం, అగ్నిధ్యాన ఆరాధనలు, అభిషేకాలు, అగ్ని ప్రతిష్టాపన, నవగ్రహ యజ్ఞాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సురేష్ బాబు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలతో అనేక అనర్థాలు



కంచికచర్ల: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉన్నప్పుడే జీవితంలో అనుకున్నది సాధించవచ్చని నవజీవన్ బాలభవన్ సీఎస్ఎన్ ఏరియా కోఆర్డినేటర్ కొనకాల జగన్ సూచించారు. మండలంలోని గండేపల్లి, కంచికచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. మత్తుపదార్థాలు సేవిస్తే జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు. జగన్ మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని, తల్లిదండ్రులు సూచన మేరకు నడుచుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. సైబర్, ఆన్‌లైన్ మోసాలు చోటుచేసుకునే తీరును వివరించి ఆయా అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గండేపల్లి, కంచికచర్ల జడ్పీ హైస్కూళ్ల హెచ్ఎంలు రామకృష్ణ, సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో ఎంతో మేలు



నందిగామరూరల్: రైతులు విధిగా భూసార పరీక్షలు చేయించాలని పరీక్షలకు అనుగుణంగా ఎరువులు వాడాలని ఏడీఏ శ్రీనివాస్ సూచించారు. మండలంలోని పల్లగిరిలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. సేంద్రియ ఎరువులు వాడటం ద్వారా తక్కువ ఖర్చుతో అధికదిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. అనంతరం సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు, శీవశిలీంద్ర నాశనల ఉపయోగం, భూసారాన్ని పెంచే పద్ధతులు, పంట వ్యర్థాలను వినియోగించే విధానం తదితర అంశాలపై రైతులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఏవో నాగేశ్వరరావు, వీఏఏ రామకృష్ణ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు

నందిగామరూరల్: పట్టణంలోని చెరువుబజారులో వేంచేసియున్న షిరిడి సాయిబాబా మందిరంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త తమ్మవరపు మల్లికార్జునరావు బుధవారం తెలిపారు. స్థానిక ఆలయ ఆవరణలో బుధవారం ఆయన మాట్లాడుతూ కాగడ హారతి, గణపతి పూజ, అన్నాభిషేకం, కనక, పుష్పాభిషేకం, సహస్ర నామ పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం నిర్వహించే భారీ అన్నదాన కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. అదేవిధంగా రామలింగేశ్వరనగర్, తొర్రగుడిపాడు, రామిరెడ్డిపల్లి గ్రామాల్లో గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయా ఆలయాల కమిటీ సభ్యులు తెలిపారు.

కదంతొక్కిన కార్మికులు

- ప్రభుత్వాల తీరుకు నిరసన
- సంక్షేమ బోర్డు ఏర్పాటుకు డిమాండ్


కంచికచర్లలో నిరసన ప్రదర్శన చేస్తున్న కార్మికులు, నాయకులు


పెనగంచిప్రోలులో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు ఆశ కార్యకర్తలు, కార్మిక సంఘ నాయకులు


నందిగామలో ర్యాలీ చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు


వత్సవాయిలో సమ్మె చేస్తున్న కార్మిక సంఘాల సభ్యులు

నందిగామటౌన్: దేశవ్యాప్త సమ్మెలో భాగంగా నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లోని అసంఘటిత రంగ కార్మికులు బుధవారం కదం తొక్కారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను తూర్పారపట్టారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నందిగామ పట్టణంలో..

సమ్మెలో భాగంగా నందిగామ పట్టణంలో కార్మికసంఘాల నాయకులు, కార్మికులు కలసి బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్, రైతుసంఘం నాయకుడు చుండూరు సుబ్బారావు మాట్లాడుతూ లేబర్ వెల్ఫేర్ ఫండ్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దుచేయాలని, కార్మిక చట్టాలను పటిష్టం చేయాలన్నారు. ముఠా, ఆటో, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్, హాకర్స్ తదితర అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలిపారు. ముఖ్యంగా జాతీయ ప్రయోజనాలకు వ్యతిరేకమైన ప్రైవేటీకరణ విధానాలను రద్దు చేయాలన్నారు. కఠినమైన శిక్షలు, జరిమానాలు విధించే మోటార్ వెహికల్ యాక్టు సవరణ చట్టాన్ని రద్దు చేసి రవాణా రంగాన్ని కాపాడాల కోరారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రభుత్వం సహకారం అందించాలన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కర్రి వెంకటేశ్వరరావు, సయ్యద్ ఖాశీం, కట్టా చామంతి, అంజి, సైదా, సలికేటి నరేష్, సరళ, వెంకట్రావమ్మ, ఆయా విభాగాల కార్మిక సంఘ నాయకులు, పెద్దసంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: కార్మిక చట్టాలను ప్రభుత్వాలు పటిష్టంగా అమలు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి దారా నాగేశ్వరరావు కోరారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం పెనుగంచిప్రోలులో అంగన్‌వాడీ వర్కర్స్, ఆశ వర్కర్స్, మధ్యాహ్న భోజన కార్మికులు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్మికులు, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక చట్టాలను తక్షణం రద్దు చేయాలన్నారు. అసంఘటిత కార్మికుల సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయాలని, ప్రైవేటీకరణ విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని పంటలకు మద్దతు ధర ప్రకటించడంతో పాటు, నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. సమ్మెలో నాయకులు పిడిమర్తి బాబు, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్లలో...

కంచికచర్ల: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేయాలని, వేతన చట్టాన్ని అమలు చేయాలని ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జీ హరికృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం కంచికచర్లలో నిరసన ప్రదర్శన చేశారు. ఈ ర్యాలీ స్థానిక కంచలమ్మ గుడి దగ్గర నుంచి నవరంగ్ హోటల్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా హరికృష్ణారెడ్డి మాట్లాడుతూ కార్మికుల శ్రేయస్సును గాలికి వదిలేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలు, వాచ్‌మెన్‌లకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రమాదవశాత్తు కార్మికులు మృతిచెందితే రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు పర్మినెంట్ చేయాలని, తోపుడుబండ్లు, ప్లాట్‌ఫాం రిక్షా కార్మికులకు ప్రమాద బీమా సదుపాయం కల్పించాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు కాలవ వెంకట్రావు, లక్కిశెట్టి ఆంజనేయులు, బండారి శ్రీను బడేటి దాసు, కాశిబోయిన రాంబాబు, కంభంపాటి శ్రీను జీనేపల్లి స్వామి, కాకుమాను రామారావు, పులి శ్రీను మనియప్ప శివరాం పాల్గొన్నారు. అదే విధంగా సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు స్థానిక రెవెన్యూ కార్యాలయం నుంచి పెట్రోలు బంక్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు.సిఐటియూ జిల్లా నాయకులు ఎం సోమేశ్వరరావు, నాయకులు పుల్లమ్మ, భూషణం, మహాలక్ష్మి వేణు, నాగరాజు, జాను, యశోద తదితరులు పాల్గొన్నారు.

వత్సవాయి మండలంలో...

వత్సవాయి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు వత్తాసు పలుకుతూ కార్మికుల పొట్ట కొడుతున్నాయని సీఐటీయు మండల కార్యదర్శి బి.రాము విమర్శించారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా వత్సవాయిలో బుధవారం కార్మిక సంఘాలు సమ్మె నిర్వహించాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలను మూసివేయించారు. ఈసందర్భంగా కార్మికసంఘ నాయకులు మాట్లాడుతూ కార్మికులకు కనీసవేతనంగా రూ.26వేలు ఇవ్వాలని, 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలన్నారు. నూతన లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా పరిషత్ సెంటర్ నుంచి గాంధీపార్కు వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో రైతుసంఘ జిల్లా ఉపాధ్యక్షులు మండేపుడి చంద్రశేఖర్, మండల కార్యదర్శి తమ్మినేని రమేష్, రాయల సుదర్శనం, కంచర్ల కొండయ్య, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ల రద్దుకు డిమాండ్


పేట తహసీల్దార్ ఆఫీసు ఎదుట ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు


కేడీసీసీబీ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న బ్యాంకు, సహకార సంఘాల సిబ్బంది

జగ్గయ్యపేట అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు జగ్గయ్యపేట పట్టణంలో బుధవారం వివిధ సంఘాల కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని సమ్మెకు సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు పోతిపాక వెంకటేశ్వర్లు, సీపీఐ నాయకులు అంబోజి శివాజీ, జూనెబోయిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొని మాట్లాడుతూ ప్రధాని మోడీ కార్మికుల పోరాటాలు, ప్రాణ త్యాగాల ద్వారా సాధించుకున్న 44చట్టాల్లో 29 చట్టాలు రద్దు చేసి కార్పొరేటర్లకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం ద్వారా కార్మికులను కట్టుబానిసలుగా మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెడుతున్న నరేంద్రమోడీ కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని దుయ్యబట్టారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక రైతు బజారు కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు సాగిన ర్యాలీలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, మున్సిపల్, ఆటో యూనియన్, భవన నిర్మాణ కార్మికులు, వివిధ బ్యాంకుల ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు భోగ్యం నాగులు, మాశెట్టి రమేష్, మహ్మద్ అసదుల్లా, సీఐటీయూ నాయకులు కమల, నాగమణి, శేషు, కోట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేడీసీసీబీ వద్ద నిరసన...

సార్వత్రిక సమ్మెలో భాగంగా పట్టణంలోని కేడీసీసీ బ్యాంకు బ్రాంచ్ సిబ్బంది, సహకార సంఘాల సిబ్బంది సమ్మెకు మద్దతుగా సంఘీభావం ప్రకటిస్తూ కేడీసీసీ బ్యాంకు ముందు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట బ్రాంచ్ చీఫ్ మేనేజర్, ఏపీసీసీబీఈఏ కేంద్ర కమిటీ సభ్యులు రమేష్, బ్రాంచ్ యూనిట్ సెక్రటరీ ఎన్.ప్రసాద్, బ్రాంచ్ సిబ్బంది, సహకార సంఘాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మెగా పేరెంట్స్ సమావేశం


సమావేశ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్ర, పక్కన ఉపాధ్యాయులు

పెనుగంచిప్రోలు: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం విద్యార్థుల పేరెంట్స్, టీచర్స్ మెగా సమావేశం నిర్వహించనున్నట్లు ఎంఈవో డి.రవీంద్ర తెలిపారు. పెనుగంచిప్రోలులోని పాఠశాలల్లో చేస్తున్న ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతి, పాఠశాల అభివృద్ధి, పాఠశాలలో జరుగుతున్న కార్యక్రమాల గురించి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి చర్చించనున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించడంతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులకు భోజనం ఏర్పాటు ఉంటుందన్నారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌తోపాటు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు అవుతారని, తల్లిదండ్రులు తప్పక హాజరు కావాలని కోరారు.

సచివాలయ సిబ్బందికి శిక్షణ


మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ పద్మావతి

చిల్లకల్లు(జగ్గయ్యపేట): పంచాయతీ ఆదాయ వనరులను పెంచేలా సిబ్బంది పనిచేయాలని ఈవోపీఆర్డీ పద్మావతి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యాచరణ ప్రణాళిక 2025–26లో భాగంగా మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు పలురకాల ప్రభుత్వ నిధులతో పాటు స్థానికంగా ఆదాయ వనరులు పెంచేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఇంటి పన్నులను ప్రత్యేక ప్రణాళిక ద్వారా వసూలు చేయడంతోపాటు అధికారుల సూచన మేరకు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో మాధవశర్మ, పంచాయతీ రాజ్ ఇన్‌చార్జ్ డీఈ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెం కిషోర్, కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, జగ్గయ్య, శ్రావణ్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ స్వామినాయక్, సచివాలయ సిబ్బంది, ఏఎస్ఎంలు, పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ భవనం పనులు పూర్తిచేయరూ..


అసంపూర్తిగా మిగిలిన స్కిల్ డెవలప్‌మెంట్ భవనం పనులు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామంలోని జగ్గయ్యపేట రోడ్డులో నిర్మించిన స్కిల్ డెవలప్‌మెంట్ భవనం పనులు అసంపూర్తిగా మిగిలాయి. గతంలో డీఎంఎస్ నిధులు రూ.కోటితో ఈ పనులు చేపట్టారు. భవనం కొంత మేర పనులు చేయగా మిగిలిన పనులు అసంపూర్తిగా నిలిచి పోవడంతో ఈ భవనం ప్రస్తుతం అసాంఘీక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని స్థానికులు చెబుతున్నారు. భవనం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. కూటమి ప్రభుత్వం స్పందించి స్కిల్ డెవలప్‌మెంట్ భవనం పనులను పూర్తి చేయించాలని చిల్లకల్లు గ్రామస్తులు కోరుతున్నారు.

పంచాయతీల అభివృద్ధికి సూచనలు


శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ శ్రీను, సుబ్బారావు, సుందరరామయ్య

పెనుగంచిప్రోలు: సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఇతర అవకాశాలను ఉపయోగించుకుని పంచాయతీలను అభివృద్ధిపథంలో నడిచేలా కార్యదర్శులు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో జి.శ్రీను సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు సాధన సూచికపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ ఎంపీడీవో కె.సుబ్బారావు, పీఆర్ ఏఈ సుందరరామయ్య, ఏపీఓ జనార్దనరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నిధుల మంజూరు కోరుతూ మంత్రికి వినతి

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల అభివృద్ధిశాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డిని కోరినట్లు జగ్గయ్యపేట ఎమ్మెల్యే తాతయ్య బుధవారం తెలిపారు.వెలగపూడిలోని సచివాలయంలో మంత్రి జనార్దనరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలోని కీలక రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు వివరించారు. చిల్లకల్లు–వేదాద్రి–బండిపాలెం–కొనకంచి రహదారి, షేర్‌మహ్మద్‌పేట–గండ్రాయి రహదారి, జగ్గయ్యపేట పట్టణం –షేర్‌మహ్మద్‌పేట రోడ్ల అభివృద్ధి కోసం రూపొందించిన అంచనాలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి అందజేయగా, వీలైనంత త్వరగా నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

పవర్‌లిఫ్టింగ్‌లో ప్రతిభచూపిన తిరుపతమ్మ



జగ్గయ్యపేట అర్బన్: కర్ణాటక రాష్ట్రం దావణగిరిలో గతనెల 23 నుంచి జరిగిన జాతీయ పవర్ లిఫ్టింగ్ చాపియన్‌షిప్‌లో రాష్ట్రజట్టుకు ప్రాతినిధ్యం వహించిన జగ్గయ్యపేట చెరువు బజారుకు చెందిన ఎం.తిరుపతమ్మ జూనియర్ బాలికల విభాగంలో బంగారు పతకం గెలుచుకుంది. 63 కేజీల కేటగిరిలో తలపడి స్క్వాడ్ 202.5 కేజీలు, బెంచ్ ప్రెస్‌లో 105 కేజీలు, డెడ్ లిఫ్టులో 185 కేజీలతో మొత్తం 492.5 కేజీల బరువు ఎత్తి ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. ఈసందర్భంగా తిరుపతమ్మను ఎమ్మెల్యే రాజగోపాల్ బుధవారం అభినందించారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు


కత్తి దాడిలో గాయపడిన జిల్లేపల్లి స్వామి

వీరులపాడు: ఇంటి సరిహద్దు వివాదం నేపథ్యంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని జుజ్జూరు గ్రామంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబసభ్యుల కథనం మేరకు జుజ్జూరు గ్రామానికి చెందిన జిల్లేపల్లి స్వామి గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. స్వామి నివాసం పక్కనే ఉంటున్న చిట్లూరి ఏసుపాదం రెండురోజుల కిందట మరుగుదొడ్డి నిర్మాణం చేపట్టాడు. ఇంటి సరిహద్దుల కొలతలు పూర్తయిన తర్వాత మరుగుదొడ్డి నిర్మాణం పనులు చేపట్టాలని జిల్లేపల్లి స్వామి సూచించాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ఏసుపాదం కత్తితో స్వామిపై విచక్షణా రహితంగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన బాధిత కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో ఏసుపాదం అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన స్వామిని కుటుంబసభ్యులు హుటాహుటిన నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ క్వారీయింగ్‌పై చర్యలకు డిమాండ్


ప్రమాదస్థలిని పరిశీలిస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

నందిగామ రూరల్: రాఘవాపురం గట్టు వద్ద సాగుతున్న అక్రమ క్వారీయింగ్ చేస్తున్న వ్యక్తులపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, సిటియూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ డిమాండ్ చేశారు. అక్రమ క్వారీయింగ్ కారణంగా బుధవారం దాసరి చిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి మృతిచెందిన నేపథ్యంలో సీఐటీయూ నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయంటూ అర్ధరాత్రి వేళ కొండ ప్రాంతంలో జాగారం చేసిన నేతలు నేడు అదే కొండను అక్రమంగా తవ్వుకుంటూ ఓ వ్యక్తి మృతికి కారకులయ్యారని మండిపడ్డారు. మృతుని కుటుంబానికి నష్టపరిహారం కింద రూ.50లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అంతకుముందు వారు ప్రమాదం చోటుచేసుకున్న రాఘవాపురం గట్టును సందర్శించారు. కార్యక్రమంలో నాయకులు సోమేశ్వరరావు, గోపీనాయక్, హుస్సేన్, శ్రీనివాసరావు, రవిశేఖర్ పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



విధులు బహిష్కరించి పేట కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

జగ్గయ్యపేట అర్బన్: హైకోర్టు న్యాయమూర్తి కె.శ్రీనివాసరెడ్డిపై సోషల్ మీడియాలో అభ్యంతర, అమానుష వ్యాఖ్యలను ఖండిస్తూ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు బుధవారం విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు.

ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ అమానవీయ చర్యలను తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వ నూతన లేబర్ చట్టాలపై నిరసన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు, న్యాయవాదులు బద్దుల వెంకట్రామయ్య, ధనుంజయ, కాంతారావు, నరసరాజు, దాసరి నాగేశ్వరరావు, నరసింహారెడ్డి, కె.శ్రీనివాసరావు, ఎం.ఆంజనేయులు, అంకమరాజు, పూలనాగరాజు, ప్రతాపరెడ్డి, బసవయ్య, రావూరి ప్రసాద్, బూడిద నరసింహారావు, చిన్న గాంధీ, నరేష్, మహంతి, కిషోర్, బిక్షమయ్య, రాజశేఖర్, శేషుకుమారి, జ్యోతి, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నందిగామ డివిజన్
79950 92114 (నందిగామ)
99122 20547 (జగ్గయ్యపేట)
Office mail : sakshiads@gmail.com